బోసి నవ్వులతో చంద్రబాబు ఫొటోను గట్టిగా హత్తుకుని భావోద్వేగానికి గురవుతున్న ఈ అవ్వ పేరు మంగమ్మ. ఈమెది ఆదోని మండలంలోని సాదాపురం గ్రామం. 85 ఏళ్ల వయసున్న మంగమ్మ గద్గద స్వరంతో వణుకుతూ చంద్రబాబు నా పెద్ద కొడుకు అంటూ మురిసిపోయింది. ఈ సందర్భంగా ఆమె మాటల్లోనే... 'నేను పూరి గుడిసెలో ఉన్నా. ఉన్న ఒక కొడుకు చూసుకోవడం లేదు. ఎవరో ఇంత కూడు పెడితే తిని కాలం చేస్తున్నా. చంద్రబాబే నా పెద్దకొడుకు. ఇచ్చిన మాట ప్రకారం ఒక్కసారే రూ.వెయ్యి పింఛన్ పెంచాడు. ఈదినం రూ.7వేలు ఇచ్చినారు. నేను చంద్రబాబు వద్దకు పోలేను. నాకు చంద్రబాబు ఫొటో ఇవ్వండి. ఒక్కసారి నా పెద్దకొడుకు చంద్రబాబుకు ముద్దు పెడుతా...'

ఈ బోసినవ్వు అమూల్యం..



సూర్యోదయాన చంద్రోదయం

- ఊరూ వాడా పింఛన్ల జాతర
- వృద్ధుల కళ్లల్లో ఆనందం
- సీఎం చంద్రబాబు చిత్రపటాలకు క్షీరాభిషేకం
- తెల్లవారుజామునే ఇళ్లకు వెళ్లి పంపిణీ చేసిన ఎమ్మెల్యేలు, అధికారులు
- ఒక్కరోజులోనే 96 శాతం పంపిణీ



ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న రోజు జూలై ఒకటో తేదీ. పింఛన్ల విషయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ అక్షరాల నెరవేరింది. ఇచ్చిన మాటకు కట్టుబడ్డ చంద్రబాబు సోమవారం తెల్లారకముందే పింఛన్‌ను పేదల ముంగిట ఉంచారు. ఎమ్మెల్యేలు, అధికారులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్ సొమ్మును అందించారు. దీంతో జిల్లా వ్యాప్తంగా పింఛన్ల పండుగ వాతావరణం కనిపించింది. పింఛన్ల విషయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని నెరవేర్చడంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు, ఇతర లబ్ధిదారుల ఆనందానికి అవధుల్లేకుండాపోయాయి. తనలో మార్పు చూస్తారంటూ పదే పదే చెప్పిన చంద్రబాబు... మార్పుతో పాటు తన మార్క్‌ను చూపించారు. పేద లబ్ధిదారుల ఇళ్లకు నేరుగా అధికారులే వెళ్లి లబ్ధిని అందజేసేలా తన పాలనాదక్షతను మరోచాటి చాటిచెప్పారు.



కర్నూలు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, ఆలూరు, పత్తికొండ, పాణ్యం నియోజకవర్గాల్లో 2,45,229 మంది వివిధ వర్గాల పింఛన్ లబ్ధిదారులు ఉన్నారు. రూ.167.35 కోట్లు పంపిణీ చేయాలి. 4,851 మంది సచివాలయ ఉద్యోగులు ఉదయం 6 గంటలకే లబ్ధిదారుల తలుపు తట్టారు. రాత్రి 8 గంటల వరకు పంపిణీ చేపట్టారు. ఒక్క రోజే 96 శాతం 2.36 లక్షల మంది లబ్ధిదారులకు రూ.16.65 కోట్లు పింఛన్ డబ్బులు అందజేసి రికార్డు సృష్టించారు. వలంటీర్లు లేకుండా ఒకటో తేదీన పింఛన్లు పంపిణీ చేయడం అసాధ్యం.. అంటూ ఎన్నికల ముందు ఓట్ల కోసం వైసీపీ నాయకుల చేసినవి కుట్రలేనని రుజువు చేశారు. సచివాలయ సిబ్బందితో ఒక్క రోజులోనే పంపిణీ చేయవచ్చు అంటూ ఆనాడు చెప్పిన మాటను చంద్రబాబు చేసి చూపించారు. కలెక్టర్ పి.రంజిత్‌బాషా, జేసీ నారపురెడ్డి మౌర్య, డీఆర్‌డీఏ - వెలుగు ప్రాజెక్టు డైరెక్టర్ సలీంబాషా పర్యవేక్షణలో ఉదయం 6 గంటలకే సచివాలయ సిబ్బంది పింఛన్ల పంపిణీ చేపట్టారు.

చంద్రబాబు ఇచ్చే పింఛన్‌తో కష్టాలు తీరుతాయి

నేను, మా పెద్దన్న ఇద్దరు వికలాంగులమే. మా నాన్నకు ఆరోగ్యం బాగా లేదు. మా అమ్మ జమ్మక్క ప్లాస్టిక్ సామాన్లు అమ్మి మమ్మల్ని పోషిస్తోంది. చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట ప్రకారం వికలాంగులకు రూ.6వేలు పింఛన్ ఇచ్చారు. నాకు మా అన్నకు ఇద్దరికి కలిపి రూ.12వేలు పింఛన్ వచ్చింది. ఇకపై మాకు కష్టాలు ఉండవు ఎవ్వరిపైనా ఆధారపడం.

- రంగన్న దివ్యాంగుడు, ఆదోని.



నగరంలోని బుధవార పేటలో కలెక్టర్ పి.రంజిత్‌బాషా వృద్ధుల ఇళ్లకే వెళ్లి పింఛన్లు అందజేశారు. ఎమ్మెల్సీ బీటీ నాయుడు, నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవ్‌తేజ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి. తిక్కారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్ బిర్లాగడ్డ ఏరియాలో పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరెడ్డి, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి వృద్ధులు, దివ్యాంగుల ఇళ్లకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి విక్టోరియా పేటలో, టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కె. మీనాక్షినాయుడు తదితరులు మండిగిరిలో పింఛన్లను పంపిణీ చేశారు. ఆలూరు, మంత్రాలయంలో టీడీపీ నాయకులు బి. వీరభద్రగౌడ్, ఎన్.రాఘవేంద్రరెడ్డి వివిధ గ్రామాల్లో వృద్ధులకు పింఛన్లు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ఆదోని జనసేన కన్వీనర్ మల్లప్ప, తుగ్గలిలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణాధికారి తుగ్గలి నాగేంద్ర పాల్గొన్నారు. అదే విధంగా నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ ఓర్వకల్లు మండలంలోని హుసేనాపురంలో పింఛన్లను అందజేశారు.



ఆదోనిలో పింఛన్లను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి



దేవనకొండ మండలంలో పింఛన్లు అందజేస్తున్న టీడీపీ నాయకుడు వీరభద్ర గౌడ్



ఆదోనిలో పింఛన్లను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, జనసేనమల్లప్ప



కర్నూలులో పింఛన్లు అందజేస్తున్న టీడీపీ నేతలు తిక్కారెడ్డి, సోమిశెట్టి, ఎమ్మెల్సీ బీటీ నాయుడు



ఎమ్మిగనూరు వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే జయనాగేశ్వర్ రెడ్డి



చంద్రబాబు నా దేవుడు

తొమ్మిది పదుల వయస్సు దగ్గర పడ్డ పెద్దక్క పింఛన్ అందించడానికి వచ్చిన అధికారిని చూసి నవ్వుతూ... 'చంద్రబాబే నా దేవుడు, నాకు అండగా నిలబడ్డాడు. రూ.7వేలు పింఛన్ ఇచ్చి నన్ను ఆదుకున్నాడు. నన్ను చూసుకొనే వారే లేరు. నాలాంటి అనాథలా ఉన్న ఎందరికో సీఎం చంద్రబాబు దేవుడయ్యాడు. ఎవ్వరిపై ఆధారపడను. నా పెద్దన్న చంద్రబాబు ఇచ్చే పింఛన్‌పై ఆధారపడతా..'

- పెద్దక్క, దివ్యాంగురాలు,
ఆర్‌జి నగర్, మండిగిరి గ్రామం, ఆదోని.



ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామంలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కంటికి రెప్పలా చూసుకుంటారు

చంద్రబాబు పింఛన్లను పెంచడంతో చాలా ఆనందంగా ఉంది. నాకు భర్త లేదు. ముగ్గురు కొడుకులున్నా నన్ను సరిగా చూసుకోవడం లేదు. జగన్ ఐదేళ్లకు వెయ్యి పెంచితే చంద్రబాబు ఒక్కేసారి రూ.వెయ్యి పెంచాడు. రూ.3వేలు ఆదనంగా కూడా ఇచ్చాడు. చంద్రబాబు ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి మా పిల్లలు నన్ను బాగా చూసుకుంటున్నారు. పింఛన్ రూ.4వేలు రావడంతో నా పిల్లలు ఇప్పుడు కంటికి రెప్పలా చూసుకుంటున్నారు. చంద్రబాబు దేవుడై నా పిల్లలను నాకు దగ్గర చేశాడు.

- హనుమంతమ్మ,
సాదాపురం, ఆదోని మండలం





పసుపుల గ్రామంలో పింఛన్లను పంపిణీ చేస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి



తుగ్గలిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, తుగ్గలి నాగేంద్ర



మంత్రాలయం మండలం మాధవరంలో పింఛన్లు అందజేస్తున్న టీడీపీ నాయకుడు రాఘవేంద్ర రెడ్డి

పేదలకు ఎన్టీఆర్ భరోసా

- పండుగ వాతావరణంలో పింఛన్ల పంపిణీ
- కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు(కలెక్టరేట్), జూలై 1: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పథకం కింద జిల్లాలో 2,45,229 మంది వివిధ రకాల పింఛన్ల లబ్ధిదారులకు రూ.167.35 కోట్లు పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. సోమవారం ఉదయం బుధవారపేటలోని ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం కింద అర్హులైన లక్ష్మీదేవి, రంగస్వామి, నాగమ్మలకు వృద్ధాప్య పింఛన్లు, ప్రమీలమ్మ, రామేశ్వరిలకు వితంతు పింఛన్లను ఇంటికి వద్దకే వెళ్లి కలెక్టర్ పంపిణీ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం ఉదయం 6 గంటల నుంచే జిల్లా అంతటా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ ప్రక్రియ ప్రారంభించామని అన్నారు. వంద శాతం పింఛన్లు పంపిణీ పూర్తి చేయడానికి అధికారులకు దిశా నిర్దేశం చేశామన్నారు. మొత్తం నాలుగు రకాల కేటగిరీల పింఛన్‌దారులలో, 11 సబ్ కేటగిరీలకు చెందిన పింఛన్‌దారులకు మొత్తం రూ.7వేలు అంటే జూలై నెలకు సంబంధించి రూ.4వేలు కలుపుకుని ఏప్రిల్, మే, జూన్ నెలలకు నెలకు రూ.1000 చొప్పున మొత్తం రూ.3వేలు కలిపి పంపిణీ చేస్తున్నామని తెలిపారు. మిగిలిన కేటగిరీలకు ప్రభుత్వం పెంచిన విధంగానే నగదును పంపిణీ చేస్తున్నామన్నారు. లబ్ధిదారుల ఇంటికి వద్దకే వెళ్లి సచివాలయ సిబ్బంది పింఛన్లు పంపిణీ చేస్తున్నారని, నగదుతోపాటు ముఖ్యమంత్రి రాసిన సందేశం లేఖను కూడా లబ్ధిదారులకు అందజేశారని అన్నారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ తదితరులు ఉన్నారు.



పింఛన్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్

వైద్యాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి

కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు(కలెక్టరేట్), జూలై 1: ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తప్పనిసరిగా ఓఆర్ఎస్, జింక్ మాత్రలను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, అతిసారా వ్యాధి నియంత్రణపె ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ పి. రంజిత్‌బాషా వైద్యాశాఖ వైద్య అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమంలో అతిసార వ్యాధికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, డీఆర్వో మధుసూదన్‌రావులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 1వ తేదీ నుంచి ఆగస్టు 31 వరకు జరిగే ఉధృత అతిసార వ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగంగా ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, విలేజ్ హెల్త్ క్లీనిక్‌లో, అంగన్‌వాడీ సెంటర్లలో తప్పనిసరిగా ఓఆర్ఎస్-జింక్ మాత్రలను అందుబాటులో ఉంచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రవీణ్ కుమార్, డీపీఎంవో ఉమ, డీఎంవో నూకరాజు, డెమో శ్రీనివాసులు శెట్టి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మిగనూరు మండలంలోని బోడబండ గ్రామంలో సీఎం ఫొటోను నెత్తిన పెట్టుకొని క్షీరాభిషేకం చేయిస్తూ అభిమానాన్ని చాటుకున్న దివ్యాంగుడు వడ్డె చెన్నప్ప

మాట నిలబెట్టుకున్న చంద్రబాబు

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి
- జిల్లా వ్యాప్తంగా పింఛన్ల పంపిణీలో పాల్గొన్న శ్రేణులు



హుశేనాపురంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్

కర్నూలు(అర్బన్), జూలై 1: ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న సీఎం చంద్రబాబు మరోసారి తానేంటో నిరూపించారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి అన్నారు. సోమవారం ఉదయం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి ఉదయం 5:30 గంటలకే టీడీపీ శ్రేణులు తరలివచ్చి పింఛన్ల పంపిణీని పర్యవేక్షించారు. మున్సిపల్ కమిషనర్ భార్గవ్ తేజ, డీఆర్‌డీపీ పీడీ సలీం బాషా, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, నగర కార్యదర్శి నాగరాజు యాదవ్, సచివాలయం సిబ్బంది, టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి బిర్లా గడ్డ స్లమ్ ఏరియాలో లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తిక్కారెడ్డి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు అధికారులతో కలిసి అర్హులైన లబ్ధిదారులకు ఒకే రోజు పంపిణీ చేయించామన్నారు. మొదటి నెలలోనే రెట్టింపు చేసి పంపిణీ చేసిన ఘనత దేశంలోనే చంద్రబాబుకు దక్కుతుందన్నారు. ఎమ్మెల్సీ బీటీ నాయుడు మాట్లాడుతూ త్వరలో అన్న క్యాంటీన్లు కూడా ప్రారంభించి పేదల ఆకలి తీరుస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వంలో నాయకత్వానికి ముందుచూపు లేకపోవడం, ఆ పార్టీ నేతల ధనదాహంతో ప్రజలకు ఏమాత్రం మేలు చేకూరలేదన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు ముంతాజ్, సత్రం రామక్రిష్ణుడు, బాలవెంకటేశ్వరరెడ్డి, బేత క్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.



కర్నూలు నగరంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవ్ తేజ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, సోమిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు

కనిపించే దేవుడు చంద్రబాబు

ఎమ్మిగనూరు రూరల్, జూలై 1: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మా గుండెల్లో దేవుడిగా నిలిచిపోయారు. మాకు పింఛన్ రూ.6వేలు వస్తుందని కలలో కూడా ఊహించలేదు. దివ్యాంగులంటే అందరూ చిన్నచూపు చూసే పరిస్థితుల్లో చంద్రబాబునాయుడు రూ.6వేల పింఛన్ ఇచ్చి మాపై ప్రేమ, ఆప్యాయత చాటుకున్నారు. మా ఇంట్లో నా భార్య, నేను ఇద్దరు వికలాంగులమే. మాకు ముగ్గురు సంతానం. ఇప్పుడు చంద్రబాబు నాయుడు ఒక్కొక్కరికి రూ.6వేల చొప్పున రూ.12వేలు ఇస్తున్నాడు. దీంతో మా సంసారం కష్టాలు తగ్గిపోతాయి.

- వడ్డె చెన్నప్ప, దివ్యాంగుడు,
బోడబండ గ్రామం, ఎమ్మిగనూరు మండలం.

దేవుడిచ్చిన పెద్దన్న చంద్రబాబు

ఆదోని, జూలై 1: దేవుడు ఇచ్చిన మా పెద్దన్న చంద్రబాబు అని దివ్యాంగుడు గోవిందు అన్నారు. ఆదోని మండలం మండగిరి గ్రామపంచాయతీలో గోవిందు, తన తల్లి ఈరమ్మ నివసిస్తున్నారు. ఒకే కుటుంబంలో తల్లి, కుమారుడికి ఇద్దరికీ పింఛన్ ఇవ్వడంతో వారి ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. గోవిందు గతంలో డ్రైవర్‌గా పనిచేసేవాడు. అయితే ఓ రోజు జరిగిన రోడ్డు ప్రమాదంలో తన కాలును కోల్పోయాడు. అప్పటి నుంచి తల్లికి వచ్చే వృద్ధాప్య పింఛన్, తనకు వచ్చే వికలాంగ పింఛన్‌తోనే కుటుంబాన్ని పోషించుకునేవాడు. పిల్లల చదువులతో పాటు కుటుంబాన్ని పోషించడం కష్టంగా మారిన సమయంలో ఇంటికి పెద్దన్నగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అండగా ఉంటూ తమకు అదనంగా మరో నాలుగు వేల రూపాయలు ఎక్కువ ఇవ్వడం ఆనందంగా ఉందని అన్నారు. ఇప్పుడు తల్లికి, గోవిందుకు కలిపి రూ.10వేలు పింఛను వస్తోంది.



పింఛన్ నగదును పంపిణీ చేస్తున్న సిబ్బంది

జిల్లా వృత్తి విద్యాధికారిగా పరమేశ్వరరెడ్డి

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 1: డీవీఈవో ఉద్యోగ బాధ్యతలను యెల్లంపల్లి పరమేశ్వరరెడ్డి సోమవారం స్వీకరించారు. డీవీఈవోగా పని చేస్తున్న జమీర్‌పాషా ఉద్యోగ విరమణ పొందడంతో ఈ పోస్టు ఖాళీ ఏర్పడింది. గోనెగండ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పని చేస్తున్న పరమేశ్వరరెడ్డికి జిల్లా వృత్తి విద్యాధికారిగా బాధ్యతలు అప్పగిస్తూ ఇంటర్మీడియట్ బోర్డు రాష్ట్ర విద్యాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కార్యాలయంలో పని చేస్తున్న ఉద్యోగులు ఆయనను కలిసి అభినందనలు తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

కర్నూలు, జూలై 1: నగర శివారులో కర్నూలు-దూపాడు రైల్వేస్టేషన్ల మధ్యలో రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో రైల్వే పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని వయస్సు 45 నుంచి 50ఏళ్ల మధ్య ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. నలుపు రంగు అడ్డం నిలువుగీతలు ఉన్న చొక్కా, పూల అడ్డపంచ మృతదేహం మీద ఉన్నాయి. మృతుని వివరాలు తెలిసిన వారు 9441970940 నెంబరుకు ఫోన్ చేయాలని హెడ్ కానిస్టేబుల్ కోదండరాముడు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

ఐటీఐలలో రెండో విడత ప్రవేశానికి దరఖాస్తులు

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 1: 2024-25 విద్యాసంవత్సరానికిగాను జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో ప్రవేశం కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు కర్నూలు డిస్ట్రిక్ట్ ప్రైవేటు ఐటీఐ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ సోమవారం తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పదో తరగతి పాసైన అభ్యర్థులు ఇంటర్, డిగ్రీ పాసైన, ఫెయిలైన అభ్యర్థులు దరఖాస్తుకు అర్హులన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు జూలై 24వ తేదీ చివరి గడువు అన్నారు. మహిళా అభ్యర్థులకు ప్రతి 33 శాతం రిజర్వేసన్ సౌకర్యం ఉందన్నారు. వివరాల కోసం సమీపంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలను సంప్రదించాలని సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ దామోదర్ చౌదరి, జిల్లా అసోసియేషన్ ప్రెసిడెంటు ఆదినారాయణ తెలిపారు.

విద్యుదాఘాతంతో గని కార్మికుడు మృతి

బనగానపల్లె, జూలై 1: మండలంలోని రామకృష్ణాపురం గ్రామానికి చెందిన వడ్డెరమేశ్ (30)అనే వ్యక్తి నాపరాయి గనిలో విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు నందివర్గం పోలీసులు సోమవారం తెలిపారు. గనిలో విద్యుత్ వైర్ సరిచేస్తుండగా అకస్మాత్తుగా విద్యుత్ సరఫరా కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. రమేశ్ మృతదేహాన్ని బనగానపల్లె ప్రభుత్వవైద్యశాలకు తరలించి బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రాయలసీమ వర్సిటీ వీసీ రాజీనామా

రిజిస్ట్రార్‌గా వెంకటేశ్వర్లు బాధ్యతలు



రిజిస్ట్రార్‌గా వెంకటేశ్వర్లు బాధ్యతలు

కర్నూలు(అర్బన్), జూలై 1: కర్నూలు జిల్లాలోని రాయలసీమ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ బి.సుధీర్ ప్రేమ్ కుమార్ తన పదవికి రాజీనామా చేశారు. సీఎంవో మౌఖిక ఆదేశాలతో ఇటీవలి కాలంలో రాష్ట్రంలోని పలు వర్సిటీల వీసీలు, రిజిస్ట్రార్లు రాజీనామాలు చేస్తున్నారు. ఇదే కోవలో రాయలసీమ వర్సిటీ వీసీ సుధీర్ ప్రేమ్ కుమార్ తన పదవికి రాజీనామా చేశారు. ఇక ఇప్పటికే రిజిస్ట్రార్‌గా రాజీనామా చేసిన నాగుల అంకన్న స్థానంలో పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ సముద్రాల వెంకటేశ్వర్లు ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించారు. దీంతో ఆయనకు వర్సిటీలోని బోధన, బోధనేతర సిబ్బంది పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలిపారు.

కొత్త చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

- న్యాయాధికారి పాండురంగారెడ్డి



కొత్త క్రిమినల్ మేజర్ యాక్టు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న 6వ అదనపు జిల్లా న్యాయాధికారి పాండురంగారెడ్డి

కర్నూలు(లీగల్), జూలై 1: కొత్త క్రిమినల్ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని కర్నూలు 6వ అదనపు జిల్లా న్యాయాధికారి పాండురంగారెడ్డి సూచించారు. సోమవారం నుంచి కొత్త క్రిమినల్ చట్టాలు అమలులోకి వచ్చిన సందర్భంగా 6వ అదనపు జిల్లా కోర్టులో ఆయన కేక్‌ను కట్ చేసి మూడు చట్టాలతో కూడిన క్రిమినల్ మేజర్ యాక్టు పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొత్త క్రిమినల్ చట్టాలపై న్యాయవాదులు, పోలీసులు అవగాహన పెంచుకుంటే కక్షిదారులకు తగిన న్యాయం చేయవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ స్వాములు, న్యాయవాదులు ఎస్.శివరామకృష్ణ ప్రసాద్, బద్దల లక్ష్మీనారాయణ, షాబుద్దీన్, ఎన్. నరేంద్రనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకుడి చేతిలో ప్రభుత్వ డేటా

- సచివాలయంలోని అధికారి కుర్చీలో కూర్చున్న వైనం
- పింఛన్లకు పేర్లు నమోదు చేస్తానని కంప్యూటర్ ముందు హల్‌చల్

ఆదోని రూరల్, జూలై 01 : ఇన్ని రోజులు అధికారానికి అలవాటుపడ్డ వైసీపీ నాయకులు అంత త్వరగా వాస్తవ ప్రపంచంలోకి రాలేకపోతున్నారు. ఓ వైసీపీ నాయకుడు గ్రామ సచివాలయంలోకెళ్లి అధికారుల కుర్చీలో దర్జాగా కూర్చొని అక్కడి కంప్యూటర్‌ను వినియోగించుకున్నాడు. అంతేగాక అక్కడికి వచ్చిన ప్రజలతో.. మీకు పింఛన్లు రావడం లేదా... అప్లికేషన్లు ఇవ్వండి నేను నమోదు చేస్తా.. క్యాస్ట్ సర్టిఫికెట్ అప్రూవల్ చేయాలా? చెప్పండి అని హల్‌చల్ చేశాడు. దీన్ని స్థానిక ప్రజలు ప్రశ్నించారు. దీంతో అక్కడ గందరగోళం నెలకొంది. ఆదోని మండలం మదిరె సచివాలయం-1లో వైసీపీ మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ ప్రధాన అనుచరుడైన అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు విజయ్‌కుమార్ సోమవారం సచివాలయానికి వెళ్లి ఈ వ్యవహారం వెలగబెట్టాడు. దీంతో ప్రజలు.. నీకేమైనా ప్రభుత్వ ఉద్యోగం వచ్చిందా? అని నిలదీశారు. కొద్దిసేపు గందరగోళం నెలకొంది. ఇంత జరుగుతోంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రజలు మండిపడ్డారు. ఇన్ని రోజులు సాయిప్రసాద్ రెడ్డి కనుసన్నల్లో నడిచిన విజయ్‌కుమార్ ప్రభుత్వం మారినా కూడా సచివాలయంలో తన కార్యకలాపాలను కొనసాగిస్తున్నాడని ప్రజలు ఆరోపించారు.



కంపూటర్ ఆపరేట్ చేస్తున్న వైసీపీ నాయకుడు

విజయ్ కుమార్ వైసీపీ నాయకుడే

గ్రామ సచివాలయంలో వైసీపీ నాయకుడు విజయ్ కుమార్ వ్యవహారం ముమ్మాటికి తప్పే. అతడు ఆపరేట్ చేస్తున్న సిస్టమ్ ఎవరిదో విచారిస్తున్నాం. ఉదయం సిబ్బంది అంతా పింఛన్ల పంపిణీ కి వెళ్లారు. ఈ విషయం విచారించి పోలీసులకు ఫిర్యాదు చేస్తాం.

- నాగరాజు, పంచాయతీ కార్యదర్శి, మదిరె

రైల్వే కోచ్ పరిశ్రమను తక్షణమే పూర్తి చేయండి



రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్నకు వినతి పత్రం అందజేస్తున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

- మంత్రులు, రైల్వే బోర్డు చైర్మన్‌కు వినతి పత్రాలు ఇచ్చిన ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కర్నూలు రూరల్ మండలం పంచలింగాల గ్రామం సమీపంలో నిర్మిస్తున్న రైల్వే కోచ్ పరిశ్రమల పనులు త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు రైల్వే మంత్రులు, బోర్డు చైర్మన్‌ను కోరారు. పార్లమెంట్ సమావేశాల్లో పాల్గొనడానికి ఢిల్లీ వెళ్లిన ఎంపీ నాగరాజు సోమవారం రైల్వే శాఖ సహాయ మంత్రులు సోమన్న, రవనీత్‌సింగ్, రైల్వే బోర్డు చైర్మన్ జయవర్మ సిన్హాలను కలసి వినతి పత్రాలు అందజేశారు. 2014లో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన రైల్వే కోచ్ ఫ్యాక్టరీ పనులు మధ్యలోనే ఆగిపోయాయని అన్నారు. మంత్రులు, రైల్వే బోర్డు చైర్మన్ జోక్యం చేసుకొని త్వరలో పనులు పూర్తి చేసి పరిశ్రమను వినియోగంలోకి తీసుకువచ్చి నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగాలు కల్పించాలని కోరారు. స్పందించిన మంత్రి సోమన్న ఈ పరిశ్రమపై నివేదిక ఇవ్వాలని రైల్వే అధికారులను ఆదేశించారని ఎంపీ నాగరాజు తెలిపారు.

కొత్తచట్టాలపై అవగాహన అవసరం

- ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించాలి
- బాధితులకు న్యాయం చేయాలి.. ● ఎస్పీ జీ. కృష్ణకాంత్

కర్నూలు, జూలై 1: కొత్త చట్టాలపై పూర్తి అవగాహన పెంచుకొని.. ప్రజలకు మరింత సమర్థవంతంగా న్యాయం అందివ్వాలని ఎస్పీ జి. కృష్ణకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం కల్లూరు మండలం ఉలిందకొండ పోలీస్‌స్టేషన్‌లో నూతన చట్టాల గురించి ఆయన అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీరో ఎఫ్ఐఆర్, నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లకుండా ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు, ఈ-మెయిల్స్, ఎస్ఎంఎస్‌లాంటి ఎలక్ట్రానిక్ మాధ్యమాలతో సమన్ల జారీ వంటి అత్యాధునిక విధానాలు న్యాయ వ్యవస్థలోకి రావడం కొత్త చట్టాల ముఖ్య ఉద్దేశమన్నారు. బ్రిటీష్ కాలం నాటి చట్టాలకు స్వస్తి పలుకుతూ ఇండియన్ పీనల్ కోడ్, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, ఇండియన్ ఎవిడెన్స్ యాక్టు స్థానంలో కొత్తగా భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్యం అధినీయం చట్టాల్ని కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. బాధితులకు వేగవంతమైన న్యాయం అందించేందుకు వీలుగా కొత్త క్రిమినల్ చట్టాల్లో కీలక మార్పులు తీసుకువచ్చిందన్నారు. వీటి వల్ల కేసుల దర్యాప్తు, విధి విధానాలు, విచారణ పద్ధతుల్లో మార్పులు వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సీఐ ప్రసాద్, కర్నూలు రూరల్ సీఐ కిరణ్ కుమార్ రెడ్డి, ఉలిందకొండ ఎస్ఐ నరేష్, కేవీ సుబ్బారెడ్డి, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, వెలుగు జీఎంఎస్‌కేఎస్ కర్నూలు బిట్స్ కళాశాల, అశోకా, ఎడిఫై, కేవీ సుబ్బారెడ్డి కళాశాల విద్యార్థులు, ఉలిందకొండ గ్రామస్థులు పాల్గొన్నారు.

న్యాయ సంహితలో కొత్తగా 21 సెక్షన్లు

దర్యాప్తులో శాస్త్రీయత, నిపుణతకు పెద్దపీట: ఎస్పీ

నంద్యాల క్రైం, జూలై 1 : కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చిన భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లో 21సెక్షన్లు కొత్తగ చేరాయని ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి తెలిపారు. నంద్యాల జిల్లాలో కొత్త చట్టాలపై సోమవారం జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్లు, వివిధ పాఠశాలలు, కళాశాలల్లో పోలీస్ అధికారుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు ఎస్పీ వెల్లడించారు. నూతన చట్టాలపై గత నెల 16నుంచి 30వ తేదీ వరకు కానిస్టేబుల్ నుంచి ఇన్‌స్పెక్టర్ స్థాయి వరకు పోలీస్ స్టేషన్లు, సర్కిల్, సబ్ డివిజన్, జిల్లా పరిధిలో ప్రతిరోజూ శిక్షణ తరగతులు నిర్వహించినట్లు ఎస్పీ తెలిపారు. నూతన చట్టాలతో ఆన్‌లైన్‌లో వారెంట్లు జారీ అవుతాయని పేర్కొన్నారు. గరిష్ఠంగా 15రోజుల వరకు నిందితులను రిమాండ్‌లోకి తీసుకోవచ్చన్నారు. శాస్త్రీయపద్ధతిలో దర్యాప్తు చేయడం, నేరాలకు కఠిన శిక్షలు విధించడం, దర్యాప్తుకు నిర్దేశిత కాలపరిమితి విధించడం మొదలైనవి ఈ చట్టాల్లో చేరాయని అన్నారు.

ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరిస్తాం

పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలు, జూలై 1: పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన సమస్యలపై విచారణ జరిపి సమస్యలను పరిష్కరిస్తామని ఎస్పీ కృష్ణకాంత్ అన్నారు. స్థానిక కొత్తపేట టూటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఎస్పీ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎస్పీ జి. కృష్ణకాంత్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి మొత్తం 76 ఫిర్యాదులు వచ్చాయి.

- బెంగుళూరు స్టార్టప్ ఎస్‌బీఎస్ఆర్ మార్కెటింగ్ మార్క్ కంపెనీ పేరుతో ఉద్యోగాలు ఇప్పిస్తామని సుమారు 80 మంది నుండి డబ్బులు తీసుకుని మోసం చేశారని అనంతపురం, నంద్యాల, కదిరి, తిరుపతి, గుంటూరు, కర్నూలు జిల్లాలకు చెందిన రఫీ, సుమన్ ఫిర్యాదు చేశారు.
- ఎమ్మిగనూరు శాంతరాజు అనే వ్యక్తి తన ఇంటికి నకిలీ నోటీసులు పంపిస్తూ డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాడని కర్నూలుకు చెందిన వెంకటేశ్ ఫిర్యాదు చేశారు.
- కర్నూలు సిరి గార్డెన్-రియల్ ఎస్టేట్ పేరుతో 2 ప్లాట్లు ఇస్తామని పది సంవత్సరాలపాటు కంతులు కట్టించుకుని మోసం చేశారని నంద్యాలకు చెందిన శ్రీలత ఫిర్యాదు చేశారు.
- కుమారుడు ఆస్తి ఇవ్వాలంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఉల్చాల గ్రామానికి చెందిన శంకర్ రెడ్డి ఫిర్యాదు చేశారు.
- సెంట్రల్ గవర్నమెంటు కాంట్రాక్టులు ఇప్పిస్తామని కర్నూలుకు చెందిన వ్యక్తులు డబ్బులు తీసుకుని మోసం చేశారని బెంగుళూరు, హైదరాబాదులకు చెందిన హరిబాబు యాదవ్, కేవీ చౌదరి ఫిర్యాదు చేశారు.
- ఎల్ఎల్‌సీ కాలువపై ఎద్దుల బండి రస్తా ఉన్నా కూడా ఎద్దుల బండి వెళ్లనివ్వకుండా ఒక వ్యక్తి అడ్డుపడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నాడని సీ. బెళగల్ మండలం బుర్రందొడ్డి గ్రామానికి చెందిన రాంబాబు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ జే. బాబు ప్రసాద్, లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు, సీఐ శివశంకర్ పాల్గొన్నారు.



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ కృష్ణకాంత్

నలుగురు ఉద్యోగులపై ఏసీబీకి ఫిర్యాదు

- కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్



మాట్లాడుతున్న సూపరింటెండెంట్

కర్నూలు(హాస్పటల్), జూలై 1: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల పరిపాలన విభాగంలో నలుగురు ఉద్యోగులపై ఏసీబీకీ ఫిర్యాదులు అందాయనీ కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆసుపత్రిలోని ధన్వంతరీ హాలులో డాక్టర్స్ డే ఉత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఫిర్యాదులు వచ్చిన ఓ జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్ సీట్లను మార్పు చేశామన్నారు. ఆసుపత్రిలో సిబ్బంది 90 శాతం పనితీరు మెరుగు పడిందన్నారు. లీవ్ ప్రపోజల్స్ ఆర్‌డీకి పంపించడానికి నెల రోజుల నుంచి తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఓ నర్సు ఆవేదన వ్యక్తం చేసింది. దీంతో స్పందించిన ఆయన సమస్యను పరిష్కరించాలని ఏఓను ఆదేశించారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ఎంవో వెంకటేశ్వరరావు, ఏఆర్ఎంవో వెంకటరమణ, ఏవో శ్రీనివాసులు, ఆఫీస్ సూపరింటెండెంట్ కుమారస్వామి, నర్సింగ్ సూపరింటెండెంట్ ఎస్‌పి సావిత్రీబాయి, ఆసుపత్రి సీనియర్ అసిస్టెంట్ చిరంజీవి, రాజశేఖర్ ఉద్యోగులు పాల్గొన్నారు.

నూతన క్రిమినల్ చట్టాలను నిలిపివేయాలి

కర్నూలు(లీగల్), జూలై 1: కొత్త క్రిమినల్ చట్టాలను వెంటనే నిలిపివేయాలని, ఇందుకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కృషి చేయాలని స్థానిక బార్ అసోసియేషన్ న్యాయవాదులు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు పాలూరి రవిగువేరా మాట్లాడుతూ ఈ కొత్త చట్టాలు ప్రజల హక్కులను కాలరాస్తాయని, ఈ చట్టాలు రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకమని అన్నారు. ఈ కార్యక్రమంలో కర్నూలు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి. కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి బీఎస్ రవికాంత్ ప్రసాద్, న్యాయవాదులు ఈ. రాజేష్, కే. ప్రభాకర్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఆర్జీకి పరిష్కారం చూపాలి: కమిషనర్



వినతులను పరిశీలిస్తున్న కమిషనర్ భార్గవతేజ

కర్నూలు(న్యూసిటీ), జూలై 1: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన ప్రతి అర్జీని త్వరితగతిన పరిష్కరించాలని కమిషనర్ భార్గవతేజ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 24 ఫిర్యాదులు వచ్చాయి. మామిదాలపాడులో రోడ్డు విస్తరణలో స్థలం పోయిందని రామక్రిష్ణ, జొహరాపురం క్రిస్టియన్ శ్మశాన వాటికలో మరిన్ని సదుపాయాలు కల్పించాలని కమిటీ సభ్యులు, చిన్న పార్కు, పబ్లిక్ టాయిలెట్స్ నిర్వహణ బాధ్యతలు తమ సామాజిక వర్గానికి ఇవ్వాలని దళిత సఫాయి కర్మచార సేవా సమితి నాయకులు జి.రమేష్, రేణుకానగర్, రాధానగర్‌లో సరైన రోడ్లు, డ్రైనేజీ లేవని, మున్సిపల్ స్థలంలో పార్కు ఏర్పాటు చేయాలని స్థానికులు రత్నారెడ్డి, శ్రీనివాసులు కమిషనర్‌కు వినతి పత్రాలు అందజేశారు. ఎస్‌ఈ డి.వేణుగోపాల్, మెడికల్ హెల్త్ ఆఫీసర్ కే. విశ్వేశ్వరరెడ్డి, ఇన్‌చార్జి సిటీ ప్లానర్ సంధ్య, ఆర్‌ఓ జునైద్, మేనేజర్ చిన్నరాముడు, టిడ్కో అధికారి పెంచలయ్య పాల్గొన్నారు.

నీటి తొట్టెలను శుభ్రం చేసుకోవాలి

కర్నూలు(కలెక్టరేట్), జూలై 1: ప్రతి శుక్రవారం నీటి తొట్టెలను శుభ్రం చేసి ఆరిన తర్వాత మళ్లీ నీరు నింపడం ద్వారా డెంగీ వ్యాధిని ప్రాథమిక దశలో అరికట్టే అవకాశం ఉంటుందని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అన్నారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరి ష్కార వేదిక కార్యక్రమంలో డెంగీ వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా తీసుకో వాల్సిన నివారణ చర్యలకు సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ పి.రంజిత్‌బాషా, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ డెంగీ నివారణకు గానూ ఇంట్లో ఉన్న నీటి నిల్వలపై దోమలు గుడ్లు పెట్టకుండా మూతలు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఇంటి పరిసరాల్లో కొబ్బరిబోండాలు, పాతటైర్లు, ఖాళీ డబ్బాలు, రాతిరుబ్బరోళ్లు, పనికిరాని ఎయిర్ కూలర్స్, బయట నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహిం చాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో మధుసూదన్‌రావు, డీఎంహెచ్‌వో ప్రవీణ్ కుమార్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఎల్‌ఐసీలో నూతన నియామకాలు చేపట్టాలి

కర్నూలు(న్యూసిటీ), జూలై 1: ఎల్‌ఐసీలో నూతన నియామకాలు చేపట్టాలని ఆ సంఘం కార్యదర్శి ఆర్. సునీల్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమ వారం ఎల్‌ఐసీ ఏఐఐఈఏ 74 వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని కార్యాలయం ఎదుట జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆర్.సునీల్‌కుమార్ మాట్లాడుతూ అధికారుల స్థాయిలో క్రమం తప్పకుండా రిక్రూమెంట్ జరుగుతుందని, ఉద్యోగుల నియామకాలు మాత్రం జరగడం లేదన్నారు. అనంతరం బ్రాంచ్ అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ జయ మాధురికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మహిళా కన్వీనర్ అంబుజాసింగ్, నాయకులు రమేష్, అబ్దుల్ ఘని పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 1: జిల్లాలోని ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో పని చేస్తున్న అధ్యాపకులు, ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు ప్రైవేటు టీచర్స్, లెక్చరర్ల సంఘం నాయకులు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాషా, రాఘవేంద్ర, సిద్ధరాముడు మాట్లాడారు.

విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయండి

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 1: నీట్, యూజీసీనెట్ పరీక్ష పేపరు లీక్‌ను నిరసిస్తూ ఈనెల 4న చేపట్టిన దేశ వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో విద్యార్థి సంఘాల నాయకులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్ యాదవ్, పీడీఎస్‌యూ ఉపాధ్యక్షులు రమణ, ఐసా కార్యదర్శి పవన్‌లు మాట్లాడుతూ నీట్ పరీక్ష పేపర్ లీక్ కావడంతో వేలాది మంది భవిష్యత్తు రోడ్డున పడిందన్నారు.

పింఛన్ల పంపిణీలో ఘర్షణ

కోడుమూరు(రూరల్), జూలై 1: మండలంలోని అమడగుంట్ల గ్రామం లో పింఛన్ల పంపిణీ సందర్భంగా టీడీపీకి చెందిన ఇరువర్గాల మధ్య ఘర్షణ తలెత్తింది. దీంతో ఒకరికి గాయాలయ్యాయి. బాధితులు, ఎస్‌ఐ కథనం మేరకు వివరాలివి.. పింఛన్ల పంపిణీలో సర్పంచ్ వరలక్ష్మి తన వర్గీయులతో కలిసి పాల్గొన్నారు. మరో వర్గానికి చెందిన వారు కూడా పాల్గొనడంతో పంపిణీ విషయంలో గొడవ జరిగింది. దీంతో సర్పంచ్ వర్గీయుడు సురేష్‌కు గాయమైంది. పోలీసులు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. సర్పంచ్ వరలక్ష్మి ఫిర్యాదు మేరకు నాగరాజు, మాదన్న, ఏసు, సుంకన్నలపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్‌ఐ బాలనరసింహులు తెలిపారు.

సీనియర్ రంగస్థల కళాకారుడి కన్నుమూత


ప్రతాపరెడ్డి(ఫైల్)

కర్నూలు(కల్చరల్), జూలై 1: కర్నూలుకు చెందిన సీనియర్ రంగస్థల కళాకారుడు డి.ప్రతాపరెడ్డి (72) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం సాయంత్రం హైదరాబాదులో కన్నుమూశారు. ఈయన తెలుగుదేశం పార్టీలో రాష్ట్ర సాంస్కృతిక విభాగంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఐదేళ్లు పనిచేశారు. అలాగే జిల్లా రంగస్థల అసోసియేషన్ అధ్యక్షుడిగానూ పదేళ్లు నాటక రంగానికి సేవలు అందించారు. ఆయన మృతిపై టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, సీనియర్ నటులు గుర్రప్పశాల అంకయ్య, గాండ్ల లక్ష్మన్న, సంగా ఆంజనేయులు, మహ్మద్ మియా తమ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

విద్యుత్‌శాఖ ఎస్‌ఈపై కలెక్టర్‌కు ఫిర్యాదు

కల్లూరు, జూలై 1: మార్చి 2023లో వాట్సాప్‌లో నాకు వచ్చిన సందేశాన్ని సోషల్ మీడియాలో పోస్టు చేశామనే కారణంతో ఎలాంటి విచారణ లేకుండా సస్పెండ్, రివర్షన్ ఇచ్చిన ఎస్‌ఈ ఎం.ఉమాపతిపై కలెక్టర్ రంజిత్‌బాషాకు ఆదోని ఈఆర్వో ఆఫీసు ఉద్యోగి ఎం.చిన్నఉశేని ఫిర్యాదు చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో మీకోసం-ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో కలెక్టరుకు వినతిపత్రం అందించారు. నా ప్రమేయం లేకుండా జరిగిన తప్పుకు తీవ్ర మనోవేదనకు గురిచేస్తున్న ఎస్‌ఈపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. మా అమ్మ డయాలసిస్ పెషంట్ నంద్యాలలో ట్రీట్‌మెంట్ తీసుకుంటుందని, నాకు అనారోగ్య సమస్యలున్నాయని నంద్యాలకు డిప్యుటేషన్ అడిగితే కనికరించడం లేదని కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న నాకు జూనియర్ అసిస్టెంట్‌గా రివర్షన్ ఇచ్చారని తెలిపారు.

ఘనంగా కర్నూలు జిల్లా ఆవిర్భావ దినోత్సవం

కర్నూలు(కల్చరల్), జూలై 1: బీ.క్యాంపులోగల ప్రభుత్వ సిల్వర్ జూబ్లీ కళాశాల్లో కర్నూలు జిల్లా 166వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కర్నూలు మానవ పరిశోధన కేంద్రం, జిల్లా మేధావుల వేదిక సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభకు ముఖ్యవక్తగా హాజరైన గాడిచర్ల ఫౌండేషన్ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు కేసీ కల్కూర మాట్లాడుతూ కర్నూలు జిల్లాకు సామాజిక, ఆధ్యాత్మిక రంగాల్లో భాగస్వామ్యం ఉందని అన్నారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ సుబ్రహ్మణ్యకుమార్ మాట్లాడుతూ కర్నూలు జిల్లా చరిత్ర విశిష్టంగా నిలుస్తుందని అన్నారు. అనంతరం కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బీఆర్ ప్రసాదరెడ్డి, మేధావుల వేదిక వ్యవస్థాపకుడు ఆచార్య మన్సూర్ రెహమాన్‌లు ప్రసంగించారు. కార్యక్రమంలో డాక్టర్ అక్తర్ బాను అధ్యాపకులు, విద్యావేత్తలు పాల్గొన్నారు.

పింఛన్‌దారుల్లో ఆనందమే లక్ష్యం

పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత

ఓర్వకల్లు, జూలై 1: పింఛన్ల పెంపుతో లబ్ధిదారుల కళ్లలో ఆనందమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు నాయుడు ముందుకు సాగుతున్నారని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. సోమవారం మండలంలోని నన్నూరు, బ్రాహ్మణపల్లె గ్రామాల్లో వృద్ధులకు ఆమె పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు పింఛన్ల మొత్తాన్ని పెంచారన్నారు. ఒక్క చాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్ మాట తప్పి విడతల వారీగా పింఛన్లు పెంచితే.. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు ఒకేసారి రూ.1000 పెంచారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మల్లేశ్వరి, నాయకులు విశ్వేశ్వరరెడ్డి, గోవిందరెడ్డి, బ్రాహ్మణపల్లి నాగిరెడ్డి, సుధాకర్ రెడ్డి, పుసులూరు ప్రభాకర్ రెడ్డి, ఖాజా మియా, విజయుడు, వడ్ల బాషా, ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు.

● మండలంలోని ఓర్వకల్లు, కన్నమడకల, కేతవరం, పూడిచెర్ల, లొద్దిపల్లె, భైరాపురం, మీదివేముల, ఉయ్యాలవాడ, ఉప్పలపాడు తదితర గ్రామాల్లో పింఛన్‌దారులకు టీడీపీ నాయకులు, సచివాలయ ఉద్యోగులు పింఛన్లు పంపిణీ చేశారు. సోమయాజులపల్లె గ్రామంలో ఎంపీడీవో మల్లేశ్వరి, టీడీపీ నాయకులు శ్రీరామ శ్రీనివాసరెడ్డి, కాకి దేవేంద్ర, ఆకుల మహేష్, నాగమల్లేష్, కాకి రామక్రిష్ణ, ఓర్వకల్లులో ఈవోఆర్‌డీ సుబ్బరాయుడు, నాయకులు అయూబ్‌బాషా, గోవిందరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, రాంభూపాల్ రెడ్డి, కన్నమడకలలో సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు, పాలకొలనులో సుధాకర్ రెడ్డి, గుట్టపాడులో సర్పంచ్ మోహన్ రెడ్డి, పంపిణీ చేశారు. కార్యక్రమంలో బోయ వెంకటరమణ, భైరీ హనుమంతు, రామమద్దిలేటి, సంజీవ, వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

హుశేనాపురంలో.. చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పింఛన్లు పెంచడంతో సోమవారం మండలంలోని హుశేనాపురం గ్రామంలో పింఛన్ల పంపిణీ పండుగలా జరిగింది. నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ ఆధ్వర్యంలో మేళతాళాలు, డ్రమ్స్‌తో మహిళలు చిందులు వేస్తూ ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. రూ.3వేల పింఛన్‌ను రూ.4వేలు పెంచడంతో వృద్ధులు ఆనందం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మల్లెల రాజశేఖర్ మాట్లాడుతూ చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం 1వ తేదీనే పింఛన్లు అందజేయడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మల్లేశ్వరి, సర్పంచ్ చంద్ర గోవర్దనమ్మ, మాజీ సర్పంచ్ మల్లెల జ్యోతి, ఎంపీటీసీ చిన్నమ్మ, ఉప సర్పంచ్ షమీనాబీ, కాల్వబుగ్గ మాజీ చైర్మన్ చంద్రపెద్దస్వామి, నాయకులు మహబూబ్‌బాషా, కేవీ మదు, ప్రశాంత్, పుల్లారెడ్డి, అన్వర్, సుధాకర్, వేణు, రాముడు, నాగరాజు, మహిళలు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అవ్వాతాతలకు భరోసా: గౌరు చరిత

కల్లూరు: సీఎం చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రంలోని అవ్వాతాతలు, అక్కాచెల్లెమ్మలకు భరోసా ఉంటుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత స్పష్టం చేశారు. సోమవారం ఎన్టీఆర్‌భరోసా పింఛన్ల పంపిణీ కల్లూరు అర్బన్, రూరల్ మండలాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల సమక్షంలో పండుగ వాతావరణంలో నిర్వహించారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత కల్లూరు అర్బన్ 19వ వార్డు గణేష్‌నగర్, 26వ వార్డు కృష్ణానగర్, 37వ వార్డు ఎన్టీఆర్ బిల్డింగ్స్, 41వ వార్డు వీకర్‌సెక్షన్ కాలనీలలో చంద్రబాబునాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రభాకర్‌యాదవ్, పెరుగు పురుషోత్తంరెడ్డి, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, వంగాల జనార్దన్‌రెడ్డి, కేతూరు మధు, బీసన్న, క్రిష్ణవేణి, కే.పార్వతమ్మ, శివ, జనార్ధన్ ఆచారి, నాగేశ్వరరావు, గంగాధర్‌గౌడ్ ఎన్‌వీ.రామకృష్ణ పాల్గొన్నారు.

● కల్లూరు మండలం ఉలిందకొండ, పర్ల, తడకనపల్లె గ్రామాల్లో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వృద్ధులకు ఎమ్మెల్యే గౌరుచరిత పింఛన్లు పంపిణీ చేశారు. సోమవారం సాయంత్రం 7.40 గటంల వరకు 93 శాతం పింఛన్ల పంపిణీ చేపట్టినట్లు ఎవరైన మిగిలిపోతే మంగళవారం పింఛన్లు అందజేస్తామని ఎంపీడీఓ తెలిపారు. తహసీల్దార్ మునివేలు, ఈఓఆర్డీ రవికిషోర్, టీడీపీ మండలం అధ్యక్షుడు డి.రామాంజనేయులు, శేఖర్, మహానంది, ఈవీ రమణ, రంగస్వామిరెడ్డి, సర్పంచు సహరాబీ, జుబేదా బేగం లక్ష్మీవరదారెడ్డి, దేవేంద్రారెడ్డి, దొడ్డిపాడు బాషా, లక్ష్మీపురం చిన్న మారెన్న, నెరవాడ జాఫర్ పాల్గొన్నారు.

టీడీపీతోనే సంక్షేమం సాధ్యం: తెలుగుదేశం ప్రభుత్వంలోనే సంక్షేమ పథకాలు సాధ్యమని కల్లూరు క్లస్టర్ ఇన్‌చార్జి పీయూ.మాదన్న, వెంకటేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత ఆదేశాల మేరకు 34వ వార్డులో వార్డు సచివాలయ ఉద్యోగులతో కలిసి పింఛన్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో భాస్కర్‌గౌడ్, నారాయణగౌడ్, డాకేష్‌గౌడ్, రాజశేఖర్‌గౌడ్, రంగప్ప, బీసన్న పాల్గొన్నారు.

హామీల అమలులో చంద్రబాబు ఆదర్శం: హామీలు అమలు చేయడంలో సీఎం చంద్రబాబు దేశానికే ఆదర్శమని 36వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి రెడ్డిగారి తిరుమలేశ్వరరెడ్డి, మాధురిరెడ్డి అన్నారు, సోమవారం పెద్దపాడులో అవ్వాతాతలకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో చిన్న బీచుపల్లి, పెద్దబీచుపల్లి పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు అమలు చేస్తాం: ఎమ్మెల్యే దస్తగిరి

కోడుమూరు: ఎన్నికల ముందు టీడీపీ ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తామని ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. పట్టణం లోని ఒకటో వార్డులోని ఎస్సీ కాలనీలో సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల ముందు పింఛన్లు రూ.4వేలు చేస్తానని హామీనిచ్చారు. ఇచ్చిన విధంగానే ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన రూ.3వేలు, జూలై మాసం పింఛన్ రూ. 4వేలు మొత్తం కలిపి రూ.7వేలను చెప్పినట్లే ఇంటికి వద్దకే పింఛన్ అందించారన్నారు. కార్యక్రమంలో సర్పంచు బాగ్యరత్న, టీడీపీ నాయకులు అమడగుంట్ల క్రిష్టారెడ్డి, కేఈ మల్లికా ర్జునగౌడ్, గోపాల్‌నాయుడు, ఎల్లప్ప నాయుడు, బ్రిటీష్‌రాముడు, బడేషాగౌడ్, బలరాం, రాముడు పాల్గొన్నారు.

కర్నూలు(రూరల్: కర్నూలు రూరల్ మండలంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం విజయవంతంగా జరిగింది. సోమవారం మండలంలో 25 గ్రామ సచివాలయంలో అధికారులు వృద్ధులు, వితంతువు, వికలాంగులకు, దివ్యాంగులకు చంద్రబాబు పెంచిన పింఛన్ డబ్బులను అందజేశారు. రూరల్ మండలంలో మొదటి రోజు 10,303 మందికి దాదాపు 90శాతం పింఛన్ పంపిణీ చేసినట్లు ఎంపీడీవో నరసింహనాయుడు తెలిపారు.

● పసుపుల గ్రామంలో సర్పంచు బొగ్గుల శీలమ్మ ఆధ్వర్యంలో కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి చేతుల మీదుగా లబ్ధిదారులను పింఛన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హేమంతకు మార్‌రెడ్డి, వీఆర్వో మద్దిలేటి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

● బి.తాండ్రపాడులో సర్పంచు ఆకెపోగు జయన్న ఆధ్వర్యంలో పింఛన్ పంపిణీ చేశారు. చంద్రబాబు చిత్రపటానికి టీడీపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కురువ మద్దిలేటి, సెక్రటరి గోపాల్, టీడీపీ నాయకులు రాజు, సత్రం రామకృష్ణుడు, రామకృష్ణ, జనసేన నాయకుడు ఆకెపోగు రాంబాబు పాల్గొన్నారు.

● దిన్నెదేవరపాడులో సర్పంచు ఎం.మాధవస్వామి పింఛన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జాకీర్‌హుస్సేన్, టీడీపీ నాయకులు మోహన్‌రెడ్డి, సుబ్బయయ్య, ఆచారి పాల్గొన్నారు.

● మునగాలపాడులో టీడీపీ నాయకులు మణిబాబు ఆధ్వర్యంలో పింఛన్ అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎం.సుంకన్న, అయ్యన్న, మహేష్‌గౌడ్, ఎర్రపక్కిరన్న, కుమార్ పాల్గొన్నారు.

● గార్గేయపురంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు సోఫీబేగ్, సాధిక్‌బేగ్, ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్ళి పింఛన్ పంపిణీ చేశారు. మాజీ సర్పంచు కౌలుట్లయ్య, తహైర్‌బేగ్, రామోజీ, అల్లీపీరా పాల్గొన్నారు.

● బాలాజీనగర్ పరిధిలో ఉన్న 40వ వార్డులో స్టాంటన్‌పురం మాజీ సర్పంచు రేపల్లె మార్కండేయులు ఆధ్వర్యంలో పింఛన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి ఆర్కే గౌడ్ పాల్గొన్నారు.

● నందనపల్లె సుగాలితాండలో విష్ణుసేనా లంబాడీ నాయకులు ఆర్.యోగేష్ నాయక్ పింఛన్‌దారులకు పింఛన్ అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అభిలాష్ పాల్గొన్నారు.

● మామిదాలపాడులో క్లస్టర్ ఇన్‌చార్జి రామేశ్వరరెడ్డి ఇంటింటికీ వెళ్ళి పింఛన్ డబ్బులు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుంకులమ్మ, గంగాధర్, మహేశ్వరరెడ్డి, ఆదిత్యారెడ్డి, గౌసీయబేగం పాల్గొన్నారు.

పేదల ఆరాధ్య దైవం చంద్రబాబు

గూడూరు: ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ రూ.4వేలతోపాటు అదనంగా మరో మూడు వేలు కలుపుకోని మొత్తం రూ.7వేలు ఇచ్చిన చంద్రబాబు పేదల పాలిట ఆరాధ్య దైవంగా నిలిచారని టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ వైస్ చైర్మన్ కురుకుంద రామాంజనేయులు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్ర గోపాల్ నాయుడు అన్నారు. సోమవారం గూడూరులో పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. టీడీపీ నాయకులు దండు సుందర రాజు, పౌలు, నాగప్పయాదవ్, తెలుగు శ్రీను, చాంద్‌బాషా, విజయ్ కుమార్, కుర్వ హనుమంతు పాల్గొన్నారు.

● **చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి:** చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకుడు రేమట వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు బుడ్డంగలి, కోడుమూరు షాషావలి, మైనార్టీ నాయకుడు మన్సూన్‌బాషా అన్నారు. సోమవారం గూడూరులో పాత బస్టాండ్‌లో పింఛన్లు పంపిణీ చేశారు.

● **చంద్రబాబు చిత్రపటానికి ఎమ్మెల్యే క్షీరాభిషేకం:** గూడూరు మండలం పెంచికలపాడులో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా సీఎం చంద్రబాబు చిత్రపటానికి కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కృష్ణ, ఎంపీటీసీ మద్దిలేటి, కర్ణం చిన్న గిడ్డయ్య పాల్గొన్నారు.

● పేదల ఆశాజ్యోతి చంద్రబాబు అని మండల తెలుగు యువత అధ్యక్షుడు సుమన్ బాబు అన్నారు. ఆర్ ఖానాపురంలో పింఛన్ల పంపి ణీ టీడీపీ నాయకులు మన్యంకొండ, కృష్ణ, నరసింహులు పాల్గొన్నారు.

సి.బెళగల్: మండల కేంద్రమైన సి.బెళగల్, పలుకుదొడ్డి, పోలకల్లు, ముడుమాల, కంబంధహాల్, బురాన్‌దొడ్డి గ్రామాలలో అవ్వతాతలకు టీడీపీ నాయకులు, ఎంపీటీసీలు, సర్పంచుల ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు, ఎంపీడీవో శకుంతల చేతుల మీదుగా పింఛన్లు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు కె రాంబూపాల్‌రెడ్డి, మూలింటి రాజు, ఎంపీటీసీ ఈరన్నగౌడు, తెలుగు మద్దిలేటి, పౌలు, బాస్కర్, పల్లెయ్య పాల్గొన్నారు.

94.71 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి: కమిషనర్

కర్నూలు(న్యూసిటీ): నగరంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ 94.71 శాతం పంపిణీ పూర్తి చేసినట్లు కమిషనర్ భార్గవ్‌తేజ తెలిపారు. నగరంలోని 133 సచివాలయ పరిధిల్లో 33,751 మంది లబ్ధిదారులు ఉండగా.. సోమవారం సాయంత్రం 6.40 గంటల వరకు 31,967 మందికి రూ.21,97,31,500లు నగదును పింఛన్‌దారులకు పంపిణీ చేసినట్లు కమిషనర్ పేర్కొన్నారు. కొందరు పింఛన్‌దారులు అందుబాటులో లేకపోవడం, సాంకేతిక సమస్యల కారణంగా పూర్తి స్థాయిలో పంపిణీ జరగలేదని, మంగళ వారం పింఛన్ పంపిణీ 100 శాతం పూర్తి చేస్తామని కమిషనర్ వెల్లడిం చారు.

పింఛన్లు వందశాతం పంపిణీ చేయాలి: నగర పాలక సంస్థ పరిధిలో ఎన్టీఆర్ పింఛన్లు వందశాతం పంపిణీ చేయాలని కమిషనర్ భార్గవతేజ సచివాలయ ఉద్యోగు లను ఆదేశించారు. ఎన్టీఆర్ భరోసా పథకంలో భాగంగా పెంచిన పింఛన్లతో కలిపి సోమవారం నగరంలో లబ్ధిదారుల ఇంటి వద్దే పంపిణీ చేశారు. బిర్లాగడ్డా 63వ సచివాలయ పరిధిలో ఏ.వెంకటస్వామికి వృద్ధాప్య పింఛన్ ఎమ్మెల్సీ బీటీ.నాయుడు అందించగా, కే.సరస్వతికి కమిషనర్ భార్గవతేజ అందించారు.

కోడుమూరు(రూరల్): మండలంలోని అన్ని గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్ సొమ్ము పంపిణీ సోమవారం ముమ్మరంగా సాగింది. వేకువ జామునే సచివాలయ సిబ్బందితో పాటు ఆయా గ్రామ టీడీపీ నాయకులు లబ్ధిదారుల ఇంటివద్దకు చేరుకుని సొమ్మును పంపిణీ చేశారు. వెంకటగిరిలో ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి నాయకులతో కలిసి సొమ్ము అందించారు.



గూడూరు మండలంపెంచికలపాడులో చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే, హుశేనాపురంలో చిందులు వేస్తున్న మహిళలు


19వ వార్డు గణేష్‌నగర్‌లో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత


కోడుమూరులో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి


ఓర్వకల్లులో పింఛన్ పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు


గూడూరులో..


34వ వార్డులో పింఛన్ పంపిణీ చేస్తున్న మాదన్న, వెంకటేశ్వర్లరెడ్డి


పెద్దపాడులో పింఛన్ పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకురాలు రెడ్డిగారి మాధురిరెడ్డి


పింఛన్ పొందిన కోడుమూరు మండలం గోరంట్లకు చెందిన తల్లి, కుమారుడు

పెద్దకొడుకు చంద్రన్న: ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ సొమ్ము రూ 4 వేలకు పెంచిన చంద్రబాబుకు జీవితాంతం రుణపడి ఉంటాం. మా ఇంట్లో వృద్ధాప్య, వికలాంగ పింఛన్ వస్తోంది. గత ప్రభుత్వంలో వాయిదా పద్ధతిలో పింఛన్ పెంచారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు ఏప్రిల్ నుంచి పింఛన్ సొమ్ము పెంచుతామని చెప్పాడు. అన్నట్లుగానే గెలుపొందిన వెంటనే బకాయి కలిపి వృద్ధులకు రూ.7 వేలు ఇచ్చారు. కొడుకు ఈశ్వరయ్య మానసిక వికలాంగుడు కావడంతో రూ.6 వేలకు పెంచారు. మాట తప్పని చంద్రన్నకు ఏమిచ్చి రుణం తీర్చుకోగలమని, చంద్రన్న మా ఇంటి పెద్దకొడుకు అని గోరంట్లకు చెందిన క్రిష్ణవేణి అనే వృద్ధురాలు ఆనందం వ్యక్తం చేసింది

ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం

కర్నూలు(హాస్పిటల్), జూలై 1: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సోమవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ సి.ప్రభాకర్ రెడ్డికి జనరల్ మెడిసిన్ వైద్యులు శుభాకాంక్షలు తెలిపారు. సూపరింటెండెంట్ మాట్లాడుతూ మెడిసిన్ డిపార్టుమెంట్ ఆసుపత్రిలో అత్యంత కీలకమైందని, క్యాజువాల్టీలో కూడా మెరుగైన సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో మెడిసిన్ విభాగాధిపతి ఇక్బాల్ హుశేన్, ప్రొఫెసర్లు కే.రాజశేఖర్, లక్ష్మీబాయి, విద్యాసాగర్, రహీం, అసోసియేట్ ప్రొఫెసర్లు సోమప్ప, డమం శ్రీనివాసులు, సీమాబ్లెస్సీ, అసిస్టెంట్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

● **మెడికవర్ హాస్పిటల్‌లో :** జాతీయ వైద్యుల దినోత్సవాన్ని కర్నూలు మెడికవర్ హాస్పిటల్‌లో నిర్వహించారు. హాస్పిటల్ వైస్ ప్రెసిడెంటు మహేశ్వర రెడ్డి మాట్లాడుతూ డాక్టర్లు ప్రాణాలు నిలపడమే కాకుండా అంతకంటే ఎక్కువ సేవలు చేస్తారన్నా రు. కార్డియాలజీ, యురాలజీ, న్యూరోసర్జరీ, ఆర్థో, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, రుమటాలజీ, మెడిసిన్ వైద్యులు చైతన్య కుమార్, అబ్దుల్ సమద్, విశ్వకుమార్, కిరణ్ కుమార్, గణేష్ కుమార్, అబ్దుల్ సమద్, సృజన, సరయురెడ్డి పాల్గొన్నారు.

● కర్నూలు జీజీహెచ్ కార్డియాలజీ విభాగంలో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రొఫెసర్ డాక్టర్ పి.చంద్రశేఖర్ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కార్డియాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ల లలిత కుమారి, ప్రశాంత్, కిరణ్ కుమార్, రవికిరణ్, బిందు పాల్గొన్నారు.

● **డాక్టర్ శంకర్‌శర్మకు సన్మానం:** ఒక వైద్యుడిగా ప్రజలకు సేవలు అందిం చడంలో కలిగే తృప్తి ఎన్ని వేల కోట్లు ఇచ్చినా కలగదని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకర్‌శర్మ అన్నారు. నగరంలోని ఎన్ఆర్‌పేటలోని బాష్యం పాఠశాలలో ఆయన్ను ఘనంగా సన్మానించారు. పాఠశాల ప్రిన్సిపాల్ శ్రావణ్ కుమార్, హెచ్‌ఎం మాధవి, బోధన సిబ్బంది పాల్గొన్నారు.


సూపరింటెండెంట్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న మెడిసిన్ వైద్యులు

పెద్దాసుపత్రిలో టెక్నికల్ టీం పర్యటన

కర్నూలు(హాస్పిటల్), జూలై 1: కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో కరెంటు సమస్య పరిష్కారానికి సోమవారం ఏపీఎస్‌పీడీసీఎల్ కర్నూలు సర్కిల్ ఎస్‌ఈ ఉమాపతి ఆదేశాల మేరకు హెచ్‌టీ ప్రొటెక్షన్ టెక్నికల్ టీం పర్యటించింది. సోమవారం పవర్‌హౌస్‌లోని రికార్డులను, లెక్చర్ గ్యాలరీ, ఎంసీ హెచ్ ట్రాన్స్‌ఫార్మర్స్, పవర్‌హౌస్ ట్రాన్స్‌ఫార్మర్లను తనిఖీ చేశా రు.

మొదటి అంతస్థులోకి పీఐసీయూ యూనిట్: కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి చిన్న పిల్లల విభాగం గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న పీఐసీయూ యూనిట్‌ను మొదటి అంతస్థులోనికి మార్చనున్నట్లు సూపరింటెండెంట్ ప్రభాకర్ రెడ్డి తెలిపారు.

ఎస్‌వోపై ఎంఈవో ఆగ్రహం

సి.బెళగల్, జూలై 1: మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాల ఎస్‌వో జ్యోతిపై మండల విద్యాధికారులు ఆదాం బాషా, జ్యోతి అగ్రహం వ్యక్తం చేశారు. ఎంఈవో ఆదాంబాషా మాట్లాడుతూ పాఠశాలలో మెనూ పాటించకుండా విద్యార్థులకు ఇష్టం వచ్చినట్లు భోజనం వడ్డిస్తున్నారని బాలికల తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారని, దీంతో సోమవారం కస్తూర్బా పాఠశాలను తనిఖీ చేశామన్నారు.

కాలం చెందిన మందులు విక్రయిస్తే చర్యలు

కోడుమూరు, జూలై 1: రైతులకు కాలం చెందిన మందులు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి రవిప్రకాష్ డీలర్లను హెచ్చరించారు. పట్టణంలోని వెంకటేశ్వర ఫర్టిలైజర్స్ దుకాణాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన దుకాణంలోని పురుగుల మందులు, ఎరువులు, విత్తనాల రికార్డులను పరిశీలించారు. దుకాణం ముందు ధరల పట్టిక తప్పనిసరిగా ఉండాలన్నారు. రైతులు కొనుగోలు చేసిన మందులు, ఎరువులు, విత్తనాలకు రసీదులు ఇవ్వాలన్నారు.

మద్యం తాగొద్దన్నందుకు వ్యక్తి ఆత్మహత్య

కర్నూలు, జూలై 1: నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో అరుణా నగర్‌లో కుమ్మరి రామాంజనేయులు అనే వ్యక్తి తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రామాంజనేయులు భవన నిర్మాణ కార్మికుడుగా పని చేస్తున్నాడు. తాగుడుకు బానిసై అప్పులు చేశాడు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. మద్యం తాగొద్దని భార్య మందలించింది. ఆ తర్వాత పిల్లలను తీసుకుని ఇంటినుంచి బయటకు వెళ్లిపోయింది. రామాంజనేయులు ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంటున్నానని బంధువులకు ఫోన్ చేసి చెప్పాడు. వాళ్లు వచ్చేలోగా ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమ్మితం మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శంకరయ్య తెలిపారు.

ఉరివేసుకుని యువకుడి ఆత్మహత్య

సి.బెళగల్, జూలై 1: మండలంలోని సంగాల గ్రామానికి చెందిన కేశవ (21) ఆదివారం ఎవ్వరు లేని సమయంలో పసువుల కొట్టంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన కేశారం రంగమ్మ దంపతుల మూడో కుమారుడు కేశవ తల్లి దండ్రులతో గొడవపడ్డాడు. వారికి ఉన్న 4 ఎకారాల పొలంలో వ్యవసాయం చేసుకొని జీవిస్తున్నారు. వ్యవసాయంలో దాదాపు రూ. 10 లక్షల అప్పు కావడంతో ఇంట్లో తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులతో కేశవకు గొడవై ఉరి వేసుకున్నాడు. మృతుడి భార్య మౌనిక గర్భిణి. ఎస్‌ఐ తిమ్మారెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మంత్రాలయంలో వంట ఏజెన్సీల మధ్య ఘర్షణ

● ఆరుగురిపై కేసు నమోదు

మంత్రాలయం, జూలై 1: మంత్రాలయం జడ్పీ ఉన్నత పాఠశాలలో రెండు వర్గాలకు చెందిన వంట ఏజెన్సీల నిర్వాహకుల మధ్య సోమవారం ఘర్షణ చోటు చేసుకుంది. ఎస్‌ఐ గోపీనాథ్ తెలిపిన వివరాల మేరకు.. విజయరామిరెడ్డి, వణికే నాగరాజు, సున్నం రాఘవేంద్ర స్థానిక హెచ్‌ఎం అంపయ్యను మధ్యాహ్న భోజనం ఎవరు వస్తే వారికి ఎలా ఇస్తారని ప్రశ్నించారు. విషయం తెలుసుకున్న మరో వర్గానికి చెందిన విజయ్, ఉప్పర రాముడు, వరదరాజులు, ఎంపీటీసీ నక్కి వెంకటేశ్, మఠం ఉద్యోగి తిమ్మారెడ్డి విజయరామిరెడ్డిని అడ్డుకుని చేతులు, కాళ్లతో కిందపడేసి దాడి చేశారు. విషయం తెలుసుకున్న హెడ్ కానిస్టేబుల్ కృష్ణయ్య, కానిస్టేబుల్ రాఘవేంద్ర, పాఠశాల పీఈటీ నరసింహ రాజు ఆపే ప్రయత్నం చేశారు. పోలీసుల రాకతో ఇరువర్గాలను శాంతింపజేసి గుమిగూడిన వారిని చెదరగొట్టారు. విజయరామిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాలుగు సెక్షన్ల కింద ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆరాధనోత్సవాలకు సన్నాహాలు చేయండి

మంత్రాలయం, జూలై 1: ఆగస్టులో జరిగే రాఘవేంద్రస్వామి 353వ ఆరాధనోత్సవాల్లో పాల్గొనే భక్తుల సౌకర్యాల కల్పన కోసం చర్యలు తీసుకోవాలని మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషి, శ్రీపతాచార్ అన్నారు. సోమవారం మంత్రాలయం శ్రీమఠంలో వలంటీర్ సర్వీసు, ఆయా శాఖల ఉద్యోగులతో ఆరాధనోత్సవాలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో పరిమళ పాఠశాల ఏవో ఈరన్న, సీఆర్వో భాస్కర్, శ్రీహరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి



శాంతా దేవిని సన్మానిస్తున్న మార్కెట్ కమిటీ కార్యదర్శి పద్మావతి

ఆదోని, జూలై 1: ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అని ఆదోని మార్కెట్ యార్డ్ సెలక్షన్ గ్రేడ్ కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి, ఎమ్మిగనూరు మార్కెట్ కమిటీ కార్యదర్శి పద్మావతి అన్నారు. సోమవారం ఎమ్మిగనూరు మార్కెట్ కమిటీ సూపర్వైజర్ శాంతాదేవి పదవి విరమణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు. మాట్లాడుతూ 41 ఏళ్లపాటు మార్కెట్ కమిటీలో పనిచేస్తూ శాంతాదేవి తన కంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. ఆయా కమిటీలలో పనిచేస్తున్నప్పటికీ ఉద్యోగంలో నిక్కచ్చిగా పనిచేశారన్నారు. ఉద్యోగులు బంధువులు కుటుంబ సభ్యులు అనంతరం ఆమెను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి శాంత కుమార్, జ్యోతి ప్రసాద్, దసుంజయ, ఉపాపతి, నాగమల్లిక సుగురయ్య డేవిడ్ పాల్గొన్నారు.

ఘనంగా ఉలిగయ్య జన్మదిన వేడుకలు


అభిమానుల సమక్షంలో పుట్టిన రోజు వేడుకలు జరుపుకుంటున్న ఉలిగయ్య

కౌతాళం, జూలై 1: మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, సీనియర్ నాయకుడు గోతులదొడ్డి ఉలిగయ్య జన్మదిన వేడుకలను సోమవారం మండల టీడీపీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల నాయకులు పూలమాలలు వేసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఉలిగయ్యకు టీడీపీ నియోజకవర్గ నాయకుడు మాధవరం రామకృష్ణారెడ్డి పూల బోకే అందించి శుభాకాంక్షలు తెలిపారు.

దేవాలయాల భూముల్ని కాపాడండి

ఆదోని, జూలై 1: హింపి విరుపాక్ష స్వామి వారి భూములను అక్రమంగా అమ్మిన వ్యక్తి పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని విరాట్ హిందు విరాట్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.







ఎమ్మిగనూరులో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బీవీ

ఆదోనిలో సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం

కోసిగిలో సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం

పత్తికొండలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

కౌతాళంలో పింఛన్ పంపిణీ చేస్తున్న నాయకులు

సల్లంగ ఉండు బిడ్డా..



జిల్లా వ్యాప్తంగా గ్రామగ్రామాన సోమవారం పండుగవాతావరణం నెలకొంది. చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పెంచిన ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను టీడీపీ ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, అధికారులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేయడంతో అంతటా కోలాహలం నెలకొంది. ఈ సందర్భంగా వృద్ధులు, వికలాంగులు, వితంతువుల యోగక్షేమాలు తెలుసుకున్నారు. గత 3 నెలలకు పెంచిన రూ. 3వేలు, జూలై నెల పింఛన్ 4వేలతో కలిపి వృద్ధులు, వితంతువులకు రూ.7వేలు, దివ్యాంగులకు 15వేల చొప్పున అందజేశారు. నాడు చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట ప్రకారమే విడతలవారి పెంపు కాకుండా ఒకేసారి పెంచుతూ మానవత్వం చాటుకున్నారంటూ సీఎం చంద్రబాబు చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తూ కృతజ్ఞత చాటుకున్నారు. 'సల్లంగా ఉండాలి బిడ్డా' అంటూ దీవెనలు కుమ్మరించారు.

ఎమ్మిగనూరు, జూలై 1 : స్థానిక 34 వార్డులో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఉదయం ఆరు గంటల నుంచి 11గంటల వరకు ఇంటింటికీ వెళ్లి వృద్ధులు, దివ్యాంగులు, చేనేతలు, వితంతువులు, ఒంటరి మహిళలకు పింఛన్లను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కొండయ్య చౌదరి, రాందాసుగౌడు, దయాసాగర్, మహేష్‌కుమార్, తురేగల్ నజీర్ రాజు, చేనేత మల్లి, ముల్లాఖలీముల్లా తదితరులు పాల్గొన్నారు.

నందవరం : నందవరం, ముగతి గ్రామాల్లో ఎమ్మెల్యే బీవీ ఇంటింటికీ తిరిగి పింఛన్ల నగదును అందజేశారు. కొన్ని గ్రామాల్లో చంద్రబాబు, ఎన్టీఆర్ చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దేశాయి మాధవరావు, పుష్పావతి, ఈరన్నగౌడు, గురురాజారావు, నాగరాజుగౌడు, బార్గవ్‌యాదవ్ పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు రూరల్ : మండల పరిధిలోని 17గ్రామ పంచాయతీల్లో మొత్తం 8,756 మందికి గాను మొదటి రోజే 8002 మందికి పింఛన్ అందజేసి 92శాతం పూర్తి చేశారు. పింఛన్ల పంపిణీలో ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా ఎంపీడీవో కొండన్న ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు. గుడికల్లులో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఇంటింటికీ తిరిగి పింఛన్లను అందజేశారు. నాయకులు పార్లపల్లి మల్లికార్జున, దేవదాసు, అయ్యన్న పాల్గొన్నారు.

గోనెగండ్ల : సాయంత్రం లబ్ధిదారులకు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నజీర్‌సాహెచ్, తిరుపతయ్యనాయుడు, బారతం బడేసా, నూరహమ్మద్ పాల్గొన్నారు.

మంత్రాలయం మండలంలోని రచ్చుమర్రిలో టీడీపీ నాయకులు రాఘవేంద్రరెడ్డి, మాధవరంలో బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు అమర్నాథ్ రెడ్డి, రఘునాథరెడ్డి, రామక్రిష్ణారెడ్డి, రాకేష్ రెడ్డి లబ్ధిదారులకు ఎన్టీఆర్ సామాజిక భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకంచేశారు.

కౌతాళం : మండల కేంద్రంలో టీడీపీ మండల నాయకులు చెన్నబసప్ప, ఉలిగయ్య, వెంకటపతిరాజు, మాధవరం రామకృష్ణరెడ్డి, కురువ వీరేష్, వల్లూరులో అడివప్పగౌడ్, ఎరిగేరిలో సురేష్, సతీష్ నాయుడు మండల అధికారులతో కలసి ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు అందజేశారు.

ఆదోని: ఎన్డీయే కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలో భాగంగా రూ.3వేల నుంచి రూ.4వేలు పింఛన్లు పెంచి లబ్ధిదారులకు ఇవ్వడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. స్థానిక విక్టోరియాపేటలో పెన్షన్ పంపిణీలో భాగంగా ఎమ్మెల్యే హాజరయ్యారు. పింఛన్ రూ.4వేలతో పాటు మూడు నెలల బకాయిలు సైతం చెల్లించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు దక్కుతుందని పేర్కొన్నారు.

వెల్దుర్తి : మండలంలో అన్ని గ్రామాలలో సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాల్లో అధికారులతో పాటు టీడీపీ నాయకులు పాల్గొని లబ్దిదారులకు అందజేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు బలరాంగౌడు, మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్‌గౌడు, రమాకాంత్‌రెడ్డి, సుబ్బరాయుడు, బోయినపల్లెలో కాంతారెడ్డి తదితరులు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

దేవనకొండ : మండల పరిధిలోని 44 గ్రామాల్లో 7507 పింఛన్లకుగాను 6778 మందికి పంపిణీ చయడంతో 90.28 శాతం నమోదయ్యింది. ఆలూరు టీడీపీ ఇన్చార్జి వీరభద్రగౌడ్ ,మండల కన్వీనర్ విజయ్‌భాస్కర్ ,బోజ్జమ్మ, రంగన్న తదితరులు ఇంటింటికీ తిరిగి పింఛన్లు పంపిణీ చేశారు.

పత్తికొండ/తుగ్గలి : పత్తికొండ, మద్దికెర, తుగ్గలి మండలాల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఉదయం 9గంటలకు పత్తికొండ కొండగేరిలో ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు పింఛన్లను పంపిణీ చేశారు. అదేవిధంగా తుగ్గలిలో టీడీపీ రాష్ట్ర నాయకుడు, కుమ్మరిశాలివాహన కార్పొరేషన్ మాజీ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర, ఆయన సతీమణి వరలక్ష్మితో కలిసి ఎమ్మెల్యే శ్యాంబాబు పింఛన్లను పంపిణీ చేశారు. తుగ్గలిలో చంద్రబాబునాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మద్దికెరలో టీడీపీనాయకులు ధనుంజయుడు, రాజన్నయాదవ్, చంద్రశేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వృద్ధులకు పింఛన్‌ను అందించారు. పెరవలిలో మాజీజడ్పీటీసీ పురుషోత్తంచౌదరి, ప్రముఖవ్యాపారి పారావిశ్వనాథ్, జొన్నగిరిలో తిరుపాల్‌నాయుడు, మాజీసర్పంచు గురుస్వామి పింఛన్‌లు అందించారు. ఈ కార్యక్రమాల్లో కురువ సంఘం నాయకులు పుండుకూర బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.


పింఛన్లను అందజేస్తున్న మాజీ జడ్పీటీసీ మీనాక్షి నాయుడు

చిప్పగిరి: ఎన్నికలలో ఇచ్చిన హామీను చంద్రబాబు నిలబెట్టుకున్నారని చిప్పగిరి మాజీ జడ్పీటీసీ మీనాక్షి నాయుడు అన్నారు. సోమవారం చిప్పగిరి మండలంలోని ఏరూర్ గ్రామంలో టీడీపీ ప్రభుత్వం పెంచిన కొత్త పింఛన్లను మాజీ జడ్పీటీసీ మీనాక్షి నాయుడు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చంద్ర, రామంజినీ, నరసింహులు, తిమ్మప్ప, బాలకృష్ణ, రామచంద్ర, పంచాయతీ కార్యాదర్శులు జయరాం నాయక్, ప్రమీలమ్మ, సుమలత, జ్యోతి, మల్లికార్జున, మీనా పాల్గొన్నారు. అదేవిధంగా నేమ్‌కల్లులో ఆలూరు టీడీపీ నేత వీరభద్ర గౌడ్, చిప్పగిరిలో ఎంపీటీసీ రజిని, తిమ్మాపురంలో టీడీపీ నాయకులు శేఖర్, నాగిరెడ్డి పింఛన్లను పంపిణీ చేశారు.


తుగ్గలిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న తుగ్గలి నాగేంద్ర


ఆలూరులో పింఛన్ పంపిణీ చేస్తున్న వీరభద్రగౌడ్


గోనెగండ్లలో సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం


పెద్దకడుబూరులో పింఛన్ పంపిణీ చేస్తున్న రాఘవేంద్రరెడ్డి


నందవరంలో సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం


సిరాలదొడ్డిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న నాయకులు


హాలేవీడులో పింఛన్ పంపిణీ చేస్తున్న వైకుంఠం దంపతులు


వెల్దుర్తిలో పింఛన్ పంపిణీ చేస్తున్న నాయకులు


కృష్ణగిరిలో పింఛన్ పంపిణీ చేస్తున్న నాయకులు

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

ఆదోని (అగ్రికల్చర్) జూలై 1: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటేందుకు ప్రతి ఒక్కరు నడుం బిగించాలని తెలుగు రైతు సంఘం జిల్లా అధికార ప్రతినిధి, దూదేకుల సంఘం రాష్ట్ర గౌరవ సలహాదారులు సాయిబాబు అన్నారు. సోమవారం సీఎం చంద్రబాబు సామాజిక పెన్షన్లను రూ.7వేలకు పెంచడం, తన పుట్టిన రోజును పురస్కరించుకొని 250 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటితే సకాలంలో వర్షాలు కురుస్తాయన్నారు. ప్రతి ఇంటి వద్ద ఒక మొక్కను నాటి బాధ్యత తీసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెన్షన్లను దేశ చరిత్రలోనే ఒకేసారి రూ.7వేలు ఇవ్వడం చారిత్రాత్మకమన్నారు. ఆయన పాలనలో ప్రతి ఒక్కరు సుభిక్షంగా ఉండాన్నారు.

ఉపాధి బకాయిలపై కమిషనర్ ఆరా...

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హాలహర్వి, జూలై 1: ఉపాధి హామీ పథకం కింద బకాయి పడ్డ వేతనాలుపై గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కన్నబాబు నివేదిక కోరినట్లు ఎపీవో హేమసుందర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 27న ఆంధ్రజ్యోతిలో వెలువడిన "అందని వేతనం.. బతుకు భారం" అనే కథనానికి కమిషనర్ స్పందించారని, దీంతో మండలంలోని 8 వారాలపాటు బాకాయి పడ్డ వేతనాలు వివరాలతో కూడిన నివేదిక కమిషన్‌కు పంపామని, జిల్లాలో రూ. 100 కోట్ల బకాయిలు వాస్తవమేనని, మండలంలో రూ.2కోట్లు ఉందని, ఈ విషయం రాష్ట్ర ఉన్నత అధికారుల దృష్టికి వెళ్లడం వల్ల త్వరలో ఉపాధి కూలీలా వేతనాలన్నీ వస్తాయని తెలిపారు.

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి : సబ్‌కలెక్టర్

ఆదోని, జూలై 1: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించిన దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని సబ్ కలెక్టర్ చిరంజీవి అధికారులను ఆదేశించారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రసెల్ సిస్టం-పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

ఆదోని మండలం ఆరెకల్ గ్రామంలోని సర్వే నెంబర్ 89లో 4.50 ఎకరాల భూమిలో 4.50 సెంట్ల స్థలంలో పదేళ్ల క్రితం ఇంటి నిర్మాణం చేసుకున్నామని, ప్రస్తుతం మా ఇంటి సమీపంలో ప్రభుత్వ భూమిని ఆక్రమణ చేసి రోడ్డు మార్గం లేకుండా చేశారని, దయతో విచారణ చేసి న్యాయం చేయాల్సిందిగా గ్రామానికి చెందిన వీరేష్ అర్జీ సమర్పించుకున్నారు. అలాగే ఆదోని మండలం నాగనాథహళ్లి గ్రామానికి చెందిన రంగయ్యకు సంబంధించి సర్వే నెంబర్ 583 నందు 2.05 ఎకరాల విస్తీర్ణం భూమి ఉన్నది ప్రస్తుతం సదరు భూమి ఆన్‌లైన్‌లో వేరే వారి పేరు నమోదు అయ్యిందని, దయతో విచారణ చేసి తన పేరును నమోదు చేయవలసినదిగా అర్జీ సమర్పించుకున్నారు. ఆదోని మండలం ఆరెకల్ గ్రామం అయ్యప్పకు సంబంధించి సర్వే నెంబర్ 147 నందు 2.40 ఎకరాల భూమి మా పెద్దల నుంచి సంక్రమించిందని, ప్రస్తుతం ఆ భూమి ఆన్‌లైన్‌లో నమోదు కాలేదని దయతో ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సిందిగా కోరారు.

కనిపించే దేవుళ్ల సేవలు అమోఘం



డాక్టర్ వేషధారణలో చిన్నారులు

ఆదోని టౌన్, జూలై 1: డాక్టర్లను రోగులు కనిపించే దేవుళ్లుగా భావిస్తారని వారి సేవలు అమోఘమని ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ (వామ్) పట్టణ అధ్యక్షుడు వంకదారు. శ్రీనాథ్ గుప్తా అన్నారు. సోమవారం డాక్టర్స్‌డే సందర్భంగా డాక్టర్లు రంజిత్ కుమార్, సౌమ్య, ప్రకృతి వైద్య నిపుణులు డా. సోమిశెట్టి కౌశిక్‌లను వామ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఇదే రోజు సీఏ దినోత్సవం కావడంతో స్థానిక చార్టర్ అకౌంటెంట్ జేపీ రవిశంకర్‌ను కూడా ఘనంగా సమనించారు. కార్యక్రమంలో వామ్ అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్ గుప్త, కార్యదర్శి నాయకంటి రఘు, కోశాధికారి రంజిత్, ఉపాధ్యక్షుడు యాదగిరి వెంకటేశ్వరులు పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్‌ల దినోత్సవం

ఆదోని (అగ్రికల్చర్) జూలై 1: జాతీయ డాక్టర్ల దినోత్సవాన్ని ఆర్ట్స్ కళాశాల జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ముఖ్య అతిథులుగా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సర్జన్ డాక్టర్ జిందే మయూర్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యవృత్తి ఎంతో సేవాగుణం కలిగినదన్నారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపల్ మురళీమోహన్ రెడ్డి, అధ్యాపకులు యుగంధర్ రెడ్డి, నళిని, రంగనాథం, నేత్రావతి పాల్గొన్నారు.

ఎమ్మిగనూరులో వైద్యుల దినోత్సవం

ఎమ్మిగనూరు టౌన్, జూలై 1 : ఎమ్మిగనూరు పట్టణంలోని నారాయణ స్కూల్‌లో సోమవారం విద్యార్థులు వైద్యుల వేషధారణలతో సందడి చేశారు. ఏజీయం రమేష్ మాట్లాడుతూ డాక్టర్ బిధాన్ చంద్రరాయ్ జయంతి సందర్భంగా ఆయన సేవలను స్మరించుకుంటూ వైద్యుల దినోత్సవం జరుపుకుంటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సురేష్, ఏ ఓ జాకిర్ పాల్గొన్నారు.